Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143




Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 116 | Sunday 06.04.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 116 | ఆదివారం 06. 04. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4

### 5,315 ఎకరాలకు సాగునీరు, తాగునీటి సమస్య...

# పరిష్కారం : సీఎం



**చంద్రబాబు పిలుపుతో పీ4కి అనూహ్య స్పందన... ముందుకువచ్చిన ప్రసాద్ సీడ్స్ అధినేత**

**కొమ్మమూరు ఎత్తిపోతల పథకానికి ప్రసాద్ సీడ్స్ రూ. 10 కోట్ల విరాళం**

**త్వరలో డీపీఆర్ సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని అధికారులకు సీఎం ఆదేశం**

**ఇప్పుడు దేశంలో జనాభా పెరగడం చాలా అవసరం : సీఎం**

**నందిగామ నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన**

**అప్పట్లో కుటుంబ నియంత్రణ పాటించమన్నామని వెల్లడి**

**ఇప్పుడు జనాభా వృద్ధి ఎంతో ముఖ్యమైన అంశం అని వివరణ**

**లేకపోతే, రాబోయే రోజుల్లో వృద్ధుల సంఖ్య పెరిగిపోతుందని ఆందోళన**

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన 'పీ4' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. పేదలకు సహాయం చేసేందుకు సంపన్నులు, పారిశ్రామికవేత్తలు ముందువస్తున్నారు. ఈ క్రమంలో, చంద్రబాబు పీ4 పిలుపును అందుకుని గుంటూరు జిల్లాకు చెందిన ఒక పారిశ్రామికవేత్త తన సొంత నిధులతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మించడానికి ముందుకు వచ్చారు. కాకమాను మండలంలోని రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొమ్మమూరు కాలువ ద్వారా నీటి సౌకర్యం ఉన్నప్పటికీ, చివరి భూములకు నీరు చేరడం లేదు. ఈ ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మిస్తే రైతుల కష్టాలు తీరుతాయని భావించిన ప్రసాద్ సీడ్స్ అధినేత ప్రసాద్, పీ4 కార్యక్రమానికి స్పందించి తనవంతు సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. ప్రసాద్ సీడ్స్ చైర్మన్ కారుమంచి ప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తమ ఆలోచనను తెలియజేశారు. కొమ్మమూరు ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.10 కోట్లు విరాళంగా ఇస్తామని ప్రకటించారు. దీని ద్వారా తమ స్వగ్రామమైన కాకమానుతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో సాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాలుగా

మిగతా 2 లో

## ఆయుధాలు వీడండి : మావోయిస్టులకు అమిత్ షా పిలుపు



న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా పిలుపుని చ్చారు. ఆయన ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బస్తర్ గిరిజనుల అభివృద్ధిని మావోయిస్టులు ఆప లేరని అన్నారు. 2026 మార్చి నాటికి నక్సల్ సమస్య అంతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. బస్తర్ లో బుల్లెట్ కాల్పులు, బాంబు పేలుళ్ల రోజులు ముగి శాయని ఆయన అన్నారు. ఆయుధాలు వీడి జనజీవ న స్రవంతిలో కలిసిపోవాలని మావోయిస్టు లకు విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు మనలో భాగ ్మేన ని, ఏ మావోయిస్టు చనిపోయినా ఎవరిలోనూ సం తోషం ఉండదని అన్నారు. ఆయుధాలను చేత ్బూ ని స్థానికుల, గిరిజనుల అభివృద్ధిని అడ్డుకోలేరని అన్నారు.

## జగ్జీవన్ రామ్ సేవలు... మహెూన్నతమైనవి : కేసీఆర్

జగ్జీవన్ రామ్ సేవలను స్మరించుకున్న కేసీఆర్

కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని కితాబు

దేశానికి ఎంతో సేవ చేశారన్న కేసీఆర్



హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉప ప్రధానిగా, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సమ సమాజ దార్శనికుడిగా జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు మహెూన్నతమైనవని కొనియాడారు. చిన్ననాటి నుంచే వివక్షను ఎదుర్కొన్న ఆయన కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని కేసీఆర్

మిగతా 2 లో

### పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు...

# అండగా ఉంటాం

డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాలు ఒకరకంగా మన దేశానికి మేలు: శ్రీధర్ బాబు

పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు భారత్ వైపు చూస్తున్నారన్న మంత్రి

పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడి



హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** వివిధ దేశాల ఉత్పత్తులపై సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఒక రక

మిగతా 2 లో


### వక్ఫ్ బిల్లు త్వరలోనే చట్టంగా...

# మారుతుంది

రైల్వే, డిఫెన్స్ తర్వాత ఎక్కువ భూమి వక్ఫ్ దగ్గర ఉంది: పురందేశ్వరి

కేవలం వక్ఫ్ బోర్డుకు సంబంధించి మాత్రమే సవరణలు చేశారని వెల్లడి

వక్ఫ్ బోర్డులో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించారన్న ఏపీ బీజేపీ చీఫ్



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన వక్ఫ్ బిల్లు త్వరలోనే చట్టంగా మారుతుందని ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి అన్నారు. అప్రజాస్వామికంగా వక్ఫ్ బిల్లు తెచ్చారని సోనియాగాంధీ అన్నారని... ఆ సమయంలో ఆమె రాజ్యసభలో ఉన్నారో లేదో తెలియదని చెప్పారు. లోక్ సభలో కూడా రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ లేరని ఎద్దేవా చేశారు. 3వ తేదీన లోక్ సభలో, 4వ తేదీన రాజ్యసభలో బిల్లు పాస్ అయిందని చెప్పారు. అల్లాహ్ మీద విశ్వాసంతో ధార్మిక కార్యక్రమాలకు భూమిని ఇస్తే అది వక్ఫ్ అవుతుందని అన్నారు. కేవలం వక్ఫ్ బోర్డుకు సంబంధించి మాత్రమే సవరణలు చేశారని... మతపరమైన అంశంలో చేయలేదని

మిగతా 2 లో

### బియ్యానికి మోదీ ప్రభుత్వమే...

# డబ్బులు ఇస్తోంది

కేంద్ర ప్రభుత్వం డబ్బులు ఇస్తోంటే, మోదీ ఫ్లెక్సీలను వారు చించేస్తున్నారు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చెప్పినా అవి మోదీ బియ్యమేనని వ్యాఖ్య

రేవంత్ రెడ్డి ఫొటో పెట్టుకుంటే అభ్యంతరం లేదన్న బండి సంజయ్



హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** సన్న బియ్యం పంపిణీకి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తుంటే, ఇక్కడ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాలను చింపడం దారుణమని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తోన్న బియ్యానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వమే నిధులను అందజేస్తోందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏమని చెప్పినా,

మిగతా 2 లో

### 2047కు ప్రతి ఒక్కరి ఇంట్లో...

# వ్యాపారవేత్తలు ఉండాలి

ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం.. మంత్రి నారాయణ ప్రకటన



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఈ రోజు ఐదు వెబ్‌సైట్‌లను ప్రారంభించడం సంతోషంగా ఉందని మంత్రి నారాయణ తెలిపారు. 2029 నాటికి సాధ్యమైనంత మేరకు పారిశ్రామిక వేత్తలను చేస్తామని ఉద్ఘాటించారు. శనివారం మంత్రి నారాయణను మెప్మా అధికారులు ఏపీ సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. డేటా

మిగతా 2 లో

# సంపాదకీయం

## నక్సల్స్ శాంతి మంత్రం

ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో కొనసాగుతున్న గాలింపు చర్యలతో శాంతి చర్చలకు తాము సిద్ధమేనని భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) ప్రకటించింది. గతంలో కూడా దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నక్సల్స్‌ను శాంతి చర్చలకు ఆహ్వానించడం ముఖాముఖి చర్చలు జరగడం తెలిసిందే. కానీ అవి చివరకు ఫలించలేదు. ఇప్పుడు మావోయిస్టుల్లో కూడా ఎన్నడూ లేని విధంగా నిస్పృహ ఆవరించినట్టు చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఇటీవల ఎన్‌కౌంటర్‌లో బయటపడిన ఒక లేఖ బట్టి తెలుస్తోంది. నక్సలైట్లకు సురక్షిత ప్రాంతమంటూ లేకుండా పోయిందని ఆ లేఖ వెల్లడించింది. అయితే ఇప్పుడు శాంతి చర్చలు జరిపేందుకు అనువైన వాతావరణం తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) డిమాండ్ చేసింది.ఆ పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో తాజాగా విడుదల చేసిన లేఖ వెలుగులోకి వచ్చింది. అయితే మావోలు కొన్ని షరతులు విధించారు. చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర (గడ్చిరోలి), ఒడిశా, జార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆపరేషన్ కగార్‌ను ఆపేయాలని డిమాండ్ చేశారు. విప్లవ ప్రభావిత ప్రాంతాల్లో సాయుధ బలగాలతో కొత్త క్యాంపులు ఏర్పాటు చేయొద్దన్నారు. ఈ షరతులకు ఒప్పుకుంటే తక్షణమే కాల్పుల విరమణకు సిద్ధమని ప్రకటించారు. ఆపరేషన్ కగార్ పేరుతో సాధారణ ఆదివాసీ ప్రజానీకంతోపాటు అగ్రనేతల వరకు 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని, అనేక మందిని చిత్రహింసలకు గురిచేసి చంపేస్తున్నారని, అందుకే ఈ యుద్ధాన్ని జినోసైడ్ (నరసంహారం)గా పేర్కొంటున్నట్టు వెల్లడించింది.ఈ లేఖకు చత్తీస్‌గఢ్ సిఎం విజయశర్మ స్పందించారు. మొదట ఈ లేఖ సాధికారత ఎంతవరకు ఉందో పరిశీలిస్తామని పేర్కొన్నారు. గతంలో కూడా కొన్ని సందర్భాల్లో శాంతి చర్చలకు మావోయిస్టులు పిలుపునిచ్చారన్నారు. అయితే ఇప్పుడు శాంతి చర్చలకు మావోయిస్టులు విధించిన డిమాండ్లను పరిగణనలోకి తీసుకునేది లేదన్నారు. గతంలో ప్రభుత్వం శాంతిచర్చల కోసం కమిటీలను ఏర్పాటు చేసిందని, ఇప్పుడు మావోయిస్టులే శాంతి చర్చలకు సిద్ధం అవుతుంటే వారు ఒక కమిటీ లేదా ఒక ప్రతినిధిని నియమించాలని ముఖ్యమంత్రి విజయశర్మ సూచించారు. 2026 మార్చి 31 లోగా చత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లు అన్నవారెవరూ లేకుండా నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే.భద్రతా దళాలు నిత్యం దండకారణ్యాన్ని జల్లెడపడుతున్నాయి. ప్రభుత్వం ఒకవైపు నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పిస్తూ మరోవైపు నక్సల్ గాలింపు ముమ్మరం చేసింది. ఈ ద్విముఖ వ్యూహం బాగానే పని చేసిందని చెప్పవచ్చు. ఇదంతా ఒక్క రోజులోనే జరిగిందనడం పొరపాటు. నిఘా వర్గాలను బలోపేతం చేశారు. భద్రతా దళాల సాయంతో మావోల పట్టున్న ప్రాంతాలను నిర్వీర్యం చేయగలిగారు. అత్యాధునిక డ్రోన్లు, నిఘా పరికరాలు, కృత్రిమ మేథ, ఉపగ్రహ ఛాయాచిత్రాల వంటి సాయంతో నక్సల్ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయగలుగుతున్నారు. అలాగే నక్సల్స్ ఆర్థిక మూలాలపై కూడా దాడులు జరుగుతున్నాయి. ఎన్ఐఎ, ఇడి వంటి కేంద్ర సంస్థలు కొన్ని కోట్ల రూపాయల నిధులను స్వాధీనం చేసుకుంటున్నాయి.నక్సల్స్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న వారిని కూడా కట్టడి చేయగలిగారు.ఇవన్నీ ఒకవైపు సాగిస్తూనే నక్సల్ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు బాగా విస్తరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 2014 నుంచి 2024 మధ్య కాలంలో ఆయా ప్రాంతాల్లో దాదాపు 11,503 కిలోమీటర్ల జాతీయ రహదారులు, 20 వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారులు ఏర్పాటయ్యాయి. దీనివల్ల అక్కడి ప్రజల జీవన విధానాల్లో, ఆర్థిక పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయి. వెయ్యికి పైగా బ్యాంకు శాఖలు, 937 ఏటిఎంల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు ముమ్మరం అయ్యాయి. 2004-2014 మధ్యకాలంతో పోలిస్తే ఇప్పుడు హింసాత్మక సంఘటనలు సగానికి సగం తగ్గాయి. ఏడాది కాలంలోనే చత్తీస్‌గఢ్ ప్రాంతంలో 380 మంది నక్సల్స్ ప్రాణాలు కోల్పోయారు.1194 మంది అరెస్టు కాగా, 1045 మంది లొంగిపోయారు. వాస్తవంగా చెప్పాలంటే నక్సలిజ ప్రభావం చాలా వరకు తగ్గిందనే చెప్పవచ్చు. ఒకప్పుడు మావోయిజానికి ఆదివాసీ యువకులు విపరీతంగా ఆకర్షితులయ్యేవారు. కానీ అప్పటి పరిస్థితులు ఇప్పుడు లేవు. భూస్వాములకు వ్యతిరేకంగా వర్గపోరాటం సాగించడమే లక్ష్యంగా నక్సల్స్ సాగుతున్నప్పటికీ చత్తీస్‌గఢ్‌లో ధనిక రైతులే తప్ప భూస్వాములు ఎవరూ లేరు. ఇప్పుడు అటవీ భూముల్లోని ఖనిజాల కోసం ఆరాటం పడుతున్న కార్పొరేట్ సంస్థల పైనే ఆదివాసీలు వర్గ పోరాటం చేయాలి. లేదా కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వ యంత్రాంగంపై పోరాటం చేయాలి. కానీ ఆర్థిక బలోపేతమే ముఖ్యమనుకుంటున్న ప్రజల ఆలోచనలు ఈ పోరాటాలకు కలిసిరావడం లేదు.మావోయిస్టులతో ప్రభుత్వ చర్చల విషయం ఎన్నోసార్లు వినిపించినా, అది పెద్ద స్థాయిలో కార్యరూపం దాల్చింది మాత్రం 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో.వైఎస్ రాజశేఖర రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం - మావోయిస్టుల మధ్య శాంతి చర్చలు జరిగాయి. 2004 అక్టోబర్ 15 నుంచి 18 వరకు చర్చలు జరిగాయి.ఈ చర్చలకు ముందే, పీపుల్స్ వార్ గ్రూపు మిగిలిన సంస్థలతో కలసి భారత కమ్యూనిస్టు పార్టీ ? మావోయిస్టుగా అవతరించింది. నల్లమల అటవీ ప్రాంతం నుంచి బయటి ప్రపంచంలోకి వచ్చిన మావోయిస్టులు, హైదరాబాద్‌లోని మంజీరా ప్రభుత్వ గెస్ట్ హౌస్‌లో బస చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ భవనంలో చర్చలు జరిగాయి.ప్రభుత్వంతో పాటు విరసం నాయకులు వరవరరావు, కళ్యాణ రావు వంటి వారు ఈ చర్చలు కార్యరూపం దాల్చడానికి కృషి చేశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ వంటి వారు మధ్యవర్తిత్వంలో కీలకంగా వ్యవహరించారు. మావోయిస్టు పార్టీ తరపున రామకృష్ణ, సుధాకర్, గణేశ్, జనశక్తి నుంచి అమర్, రియాజ్ వంటి వారు ఈ చర్చల్లో పాల్గొన్నారు.ప్రభుత్వం తరపున అప్పటి హోం మంత్రి జానా రెడ్డి సహా 8 మంది బృందం చర్చల్లో పాల్గొంది. భూమి లేని వారికి భూమి పంపిణీపై ప్రధానంగా అప్పటి చర్చలు సాగాయి. చర్చలు సానుకూలంగా జరిగాయని, మళ్లీ చర్చలు జరుపుతామని మొదట్లో ప్రకటించినా, మొత్తంగా ఆ చర్చలు సఫలం కాలేదు.2005 జనవరి 17న తాము చర్చల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించింది మావోయిస్టు పార్టీ. 2004 ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ హయాంలో మావోయిస్టుల ఏరివేతను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎలా చురుగ్గా చేపట్టిందో, ఈ చర్చల విఫలం తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అలానే మావోయిస్టుల ఏరివేతను కొనసాగించింది తరువాత కూడా ఈ చర్చల అంశం చర్చకు వస్తూనే ఉంది. అనేకసార్లు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి, మావోయిస్టుల నుంచి కూడా శాంతి చర్చలకు సిద్ధమే అనే ప్రకటనలు ఇవ్వడం, దానికి మావోయిస్టులు షరతులు పెట్టడం సాధారణం అయింది.కొన్నిసార్లు ప్రభుత్వం తరపున వచ్చిన ప్రకటనలు మోసపూరితమైనవిగా మావోయిస్టులు ప్రకటించిన సందర్భాలున్నాయి. కానీ, ఏదీ పక్కాగా ముందుకు వెళ్లలేదు. లేఖలకే పరిమితమైంది.ఇప్పుడు తాజాగా ఈ చర్చల అంశం మరోసారి ముందుకొచ్చింది.

## 5,315 ఎకరాలకు సాగునీరు, తాగునీటి సమస్య...

విత్తన వ్యాపారంలో ఉన్న కారుమంచి ప్రసాద్, 1995 నుంచి ఆ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలకు సహాయం చేస్తున్నారు. కారుమంచి ప్రసాద్ చేసిన విరాళం ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని చంద్రబాబు అన్నారు. కొమ్మమూరు ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కోసం వెంటనే డీపీఆర్ సిద్ధం చేయాలని, అనుమతులు మంజూరు చేయాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రసాద్ అందించే ఆర్థిక సహాయంతో అధికారులు సమన్వయం చేసుకుని లిఫ్ట్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. తన ఆలోచనలకు అనుగుణంగా ప్రజలు ముందుకు రావడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. 43 కిలోమీటర్ల పొడవున్న కొమ్మమూరు కాలువలో చివరి 10 కిలోమీటర్ల మేర భూములకు సాగునీరు సరిగా అందడం లేదు. ఈ సమస్యను పరిష్కరించడానికి కాకమాను దగ్గర కొమ్మమూరు కాలువపై లిఫ్ట్ నిర్మించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే కాకమాను, బీకే పాలెం, అప్పాపురం, గరికపాడు, కొండపాతూరు గ్రామాల్లోని సుమారు 5,315 ఎకరాలకు సాగునీరు అందుతుంది. అలాగే, కాకమాను మండలంలో తాగునీటి సమస్య కూడా తీరుతుంది. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా 10 కిలోమీటర్ల పొడవునా చివరి ఆయకట్టు వరకు 100 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా 100 అడుగుల వెడల్పుతో కాలువను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ప్రసాద్ వ్యక్తిగతంగా సహాయం చేయడానికి ముందుకు రావడంతో ప్రభుత్వం కూడా అవసరమైన నిధులు వెచ్చించి పనులు పూర్తి చేయనుంది.

**ఇప్పుడు దేశంలో జనాభా పెరగడం చాలా అవసరం: సీఎం చంద్రబాబు**

ఉమ్మడి కృష్ణా జిల్లా నందిగామ నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటించారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అప్పట్లో పరిస్థితుల దృష్ట్యా కుటుంబ నియంత్రణ పాటించమన్నామని, ఇప్పటి పరిస్థితుల నేపథ్యంలో దేశంలో జనాభా పెరగాల్సి అవసరం చాలా ఉందని అన్నారు. లేకపోతే, రాబోయే రోజుల్లో దేశంలో వృద్ధుల సంఖ్య పెరిగిపోతుందని అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇప్పుడు ఇదే సమస్యగా ఉందని తెలిపారు. వృద్ధుల సంఖ్య ఎక్కువగా ఉండే దేశాల్లో ఉత్పాదకత తగ్గిపోతుంటుందని వివరించారు. జనాభా వృద్ధి చెందడం అత్యంత ముఖ్యమైన అంశం అని స్పష్టం చేశారు. దేశంలో రెండో తరం సంస్కరణలకు శ్రీకారం చుట్టామని, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

**గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పు చేసి పోయింది!**

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంది. గత ప్రభుత్వం ఇష్టానుసారం వ్యవహరించి రూ.10 లక్షల కోట్ల అప్పు చేసి పోయింది. నాయకుడు విధ్వంసం సృష్టిస్తే రాష్ట్రం సర్వనాశనం అయిపోయింది. నాయకుడు దూరదృష్టితో ఆలోచిస్తేనే సమాజం బాగుంటుంది. అప్పట్లో నేను ఐటీ రంగాన్ని ప్రోత్సహించాను. ఇప్పుడు తెలుగువారు ప్రపంచంలోని ప్రతీ దేశంలో సత్తా చాటుతున్నారు. మట్టిలో మాణిక్యాల్లాంటివారు మన పిల్లలు. బాగా చదివిస్తే ప్రపంచాన్ని ఏలుతారు. ఇప్పుడు ఏపీలో సంపద సృష్టించే ప్రయత్నం చేస్తున్నాం. సంపదను సృష్టించి అందరికీ పంచుతాం. అట్టడుగున ఉన్న 25 శాతం మంది పేదల కోసమే పీ4 తీసుకువచ్చాం... అని చంద్రబాబు వివరించారు.

## ఇక మారనున్న దివిసీమ...

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణాజిల్లా నాగాయలంకలోని క్షిపణి పరీక్షా కేంద్రం నిర్మాణం ఎప్పుడు మొదలుకానుందనే దానిపై ఇప్పటి వరకు స్పష్టత లేదు.పధ్నాలుగేళ్ల కిందట ఆంధ్రప్రదేశ్‌కు మంజూరైన ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడంలో ఆలస్యమైంది. ఓ దశలో గుజరాత్‌కు తరలిపోనుందనే ప్రచారం కూడా జరిగింది.అయితే, ఆరు నెలల కిందట ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరిగిన కేంద్రమంత్రివర్గ భద్రత కమిటీ ఈ ప్రాజెక్టు ఏపీలోనే నిర్మించనున్నట్లు స్పష్టం చేయడంతో ఇక్కడి నుంచి ప్రాజెక్టు వెళ్లిపోతుందనే సందేహాలు తొలగిపోయాయి.ఇక మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ నిర్మాణం ఏపీలోనే కానుందనే నిర్ధరణ ఆ కమిటీ సమావేశం తర్వాత వచ్చింది. కానీ, ప్రాజెక్టు శంకుస్థాపన ఎప్పుడంటే మాత్రం దాదాపు ఆరునెలలుగా రాష్ట్ర స్థాయిలో ఎవరూ సరిగ్గా చెప్పడం లేదు. మరోవైపు డిఫెన్స్ వర్గాలు దీనిపై ఏమీ మాట్లాడలేమని అంటున్నాయి.దేశ రక్షణ అవసరాల దృష్ట్యా ఒడిశాలోని బాలాసోర్‌కు తోడుగా మరో మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ నిర్మాణం అవసరమని భావించిన కేంద్ర ప్రభుత్వం 2011లో ఆంధ్రప్రదేశ్‌కు ఈ ప్రాజెక్టును కేటాయించింది. అప్పట్లోనే ఈ కేంద్రం నిర్మాణానికి కృష్ణా జిల్లా దివిసీమలోని నాగాయలంక మండలం గుల్లలమోద గ్రామ పరిధిని అనువైన ప్రాంతంగా గుర్తించారు.ఈ గ్రామం సముద్రతీర ప్రాంతం కావడం, చుట్టుపక్కల ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో జనావాసాలు లేకపోవడంతో క్షిపణి ప్రయోగాలకు అనుకూలంగా ఉంటుందని నిర్ణయించారు.

మిస్సైల్స్ టెస్ట్‌లు చేసిన క్రమంలో శకలాలు సముద్రంలోనే పడిపోతాయనీ, ఎవరికీ ఎలాంటి ప్రమాదం ఉండదనీ పర్యావరణానికి కూడా విఘాతం ఉండబోదని అప్పట్లో నిర్ణయించారు.ఈ క్రమంలో 2012లో ఈ ప్రాజెక్టుకు భూములను కేటాయించాల్సిందిగా డీఆర్‌డీవో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వాన్ని కోరిందిఅయితే, ఆనాడు సమైక్యాంధ్రప్రదేశ్‌లో నెలకొన్న విభజన ఉద్యమాల నేపథ్యంలో భూములపై పాలకులు దృష్టి సారించలేదు. దాంతో దాదాపు ఐదేళ్ల పాటు ఈ ప్రాజెక్టుపై కదలిక రాలేదు.

నాగాయలంక మండలం గుల్లలమోద

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన తర్వాత 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు కోసం 381.61 ఎకరాల భూమిని డీఆర్‌డీవో (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)కు కేటాయించారు. అయితే ఈ భూములు కేటాయించిన ప్రాంతంలో మడ అడవులు ఉండటంతో అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో నాటి ప్రభుత్వం ఆ భూములకు బదులుగా గణపేశ్వరం పరిధిలోని 381.61 ఎకరాల రెవెన్యూ భూమిని అటవీ శాఖకు అప్పగిస్తూ, జీవో 1352 ఇవ్వడంతో భూ సమస్య తొలిగింది.ఆ తర్వాత 2017లోనే కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి తొలి దశ అనుమతులు వచ్చాయి.2018లో సీఆర్‌జెడ్ నుంచి కూడా మినహాయింపు తీసుకున్నారు. 2019లో పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి రెండో దశ అనుమతులు లభించగా, 2020?21లో ఆ స్థలాన్ని డీఆర్‌డీవో స్వాధీనం చేసుకొని ప్రహరీని, ప్రవేశ ద్వారాన్ని, ఓ భవనాన్ని నిర్మించింది.ప్రహరీ, భవనం నిర్మాణం తర్వాత నుంచి అంటే దాదాపు మూడేళ్లుగా ప్రాజెక్టుపై ఎలాంటి పురోగతీ లేకుండా పోయింది. దీంతో ఓ దశలో ఈ ప్రాజెక్టు గుజరాత్‌కి తరలిపోనుందనే ప్రచారం కూడా జరిగింది.గతేడాది 2024 అక్టోబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగిన కేంద్ర మంత్రివర్గ భద్రత కమిటీ నాగాయలంక మండలంలోని గుల్లలమోదలోనే క్షిపణి ప్రయోగ పరీక్షా స్థావరం ఏర్పాటుకు ఆమోదం తెలపడంతో ఇక ఇక్కడే ఉంటుందనే స్పష్టత వచ్చింది వైఎస్సార్‌సీపీ హయాంలో 2019?24 మధ్య ప్రాజెక్టు జాప్యం, తరలిపోతుందని జరిగిన ప్రచారంపై ఆ ఐదేళ్ల పాటు అవనిగడ్డ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా చేసిన సింహాద్రి రమేశ్ బాబు చెబుతున్నారు.వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే డీఆర్‌డీవో స్థలాన్ని అప్పగించామని, 2021లోనే భవన నిర్మాణాలు పూర్తయ్యాయని ఆయన చెప్పారు. ఆ ప్రాజెక్టు పనులు మొదలుపెట్టాలని సంబంధిత రక్షణశాఖ అధికారులకు తనతో పాటు ఎంపీ మిథున్ రెడ్డి చాలాసార్లు విజ్ఞప్తి చేశామని తెలిపారు. కారణాలు తెలియదు కానీ, పనులు మాత్రం మొదలు కాలేదని రమేశ్ బాబు తెలిపారు.పనులు ఎవరి హయాంలో జరిగినా ఆ ప్రాంతానికి మేలు జరిగితే చాలని ఆయన అన్నారు.ఈ కేంద్రం నిర్మాణం పూర్తయితే ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే కీలకమైన క్షిపణుల పరీక్షలు ఇక్కడి నుంచే చేస్తారు.అలాగే డీఆర్‌డీవో ఆవిష్కరించే అనేక రకాల మిస్సైల్స్‌ను పరీక్షిస్తారు.దూరప్రాంతాలను లక్ష్యంగా చేసుకునే బాలిస్టిక్ మిస్సైల్స్‌తో పాటు క్రూజ్ మిస్సైల్స్, యాంటీ మిస్సైల్స్ సిస్టమ్స్ వంటివి పరీక్షిస్తారు.మిస్సైల్ గైడెన్స్ సిస్టమ్స్, ప్రొపల్షన్ సిస్టమ్స్‌తో పాటు అనేక కీలక సాంకేతిక విభాగాలు ఇక్కడ ఏర్పాటు చేస్తారు.మిస్సైల్స్‌ను పరీక్షించిన సందర్భంలో డేటాను విశ్లేషించేందుకు కంప్యూటర్ ఆధారితంగా సిమ్యులేషన్ వ్యవస్థలనూ ఉపయోగించుకుంటారు.ఈ మేరకు ఇక్కడ టెస్టింగ్ అవసరాలకు సంబంధించిన యూనిట్లను, బ్లాక్‌లను నిర్మించాల్సి ఉంది. కాగా, డీఆర్‌డీవో చైర్మన్‌గా 2021లో ఇక్కడికి వచ్చి పరిశీలించిన ప్రస్తుత రక్షణశాఖ సలహాదారు సతీశ్ రెడ్డి క్లారిటీ ఇచ్చారుపనుల మొదలుపై స్పష్టత వచ్చిన తర్వాత వివరంగా మాట్లాడతాననీ, మొత్తంగా క్షిపణి పరీక్షా కేంద్రం నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయని ఆయన అన్నారు.వాస్తవానికి ఈ ఏడాది తొలినాళ్లలో జనవరిలో ప్రధాని మోదీ విశాఖపట్నం పర్యటన సందర్భంలోనే ఆయనతో వర్చువల్‌గా ఈ కేంద్రానికి శంకుస్థాపన చేయించడానికి అన్ని ఏర్పాట్లు చేశామనీ, అయితే చివరి నిమిషంలో రద్దు అయిందని మచిలీపట్నం ఆర్డీవో స్వాతి బీబీసీకి తెలిపారు.అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు కావటంతో ఆయనే స్వయంగా వచ్చి శంకుస్థాపన చేస్తారని, అందువల్లనే అప్పుడు వాయిదా పడిందన్న సమాచారం తమకు వచ్చిందని ఆర్డీవో చెప్పారు.ఈ నెలలో అమరావతి పునర్నిర్మాణ పనులకు మోదీ వస్తే అప్పుడేమైనా ఇక్కడికి కూడా వస్తారా.. లేదంటే అక్కడి నుంచే వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారా? అనే దానిపై తమకు ఇంకా స్పష్టత లేదని ఆర్డీవో పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టుతో దివిసీమ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు.ఈ ప్రాజెక్టు తరలిపోతుందన్న ప్రచారంతో ఆందోళన చెందామని కానీ, ఇక్కడే నెలకొల్పుతారని గత అక్టోబర్‌లో స్పష్టత రావడంతో ఎప్పుడు శంకుస్థాపన చేస్తారా అని ఎదురు చూస్తున్నట్లు ఆయన తెలిపారు.ఎప్పుడు పనులు మొదలు పెడతారనే దానిపై ఇంకా స్పష్టత లేదని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి బీబీసీతో అన్నారు.ప్రాజెక్టు రాకతో ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెంది, ఎంతోమందికి జీవనోపాధి లభిస్తుందని బాలశౌరి అన్నారు.ప్రాజెక్టుకు సంబంధించిన ఏ సమాచారం కూడా ఇప్పుడు మీడియాకి ఇవ్వలేమని కల్నల్ సమీర్ శర్మ అన్నారు.కాగా, విశాఖ డీఆర్‌డీవో (రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ), ఎన్ఎస్‌టీఎల్ (నేవల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లేబొరేటరీ) అధికారులు ఈ విషయంపై మాట్లాడేందుకు సుముఖత చూపలేదు.

## రోజా వర్సెస్ షర్మిళ



విజయవాడ, : వైఎస్ జగన్ వర్సెస్ వైఎస్ షర్మిల.. ఈ యుద్ధం మొదలై చాన్నాళ్లవుతోంది. ఈ గొడవలో వైఎస్ఆర్ సతీమణి విజయమ్మ ఎవరివైపు నిలబడ్డారనే విషయం అందరికీ తెలిసిందే. ఆస్తుల గొడవ, కంపెనీ వాటాల గొడవ.. ఇతరత్రా వైరం కాస్తా చివరకు రాజకీయ వైరంగా మారింది. గతంలో వైసీపీని నిలబెట్టేందుకు అన్న జగన్ ని ముఖ్యమంత్రిని చేసేందుకు షర్మిల ఎంత కష్టపడ్డారో, గత ఎన్నికల్లో వైసీపీ పతనాన్ని ఆమె అంతగా కోరుకున్నారు. ఆ పంతం నెరవేర్చుకున్నారు. ఓటమి తర్వాత కూడా జగన్ తప్పుల్ని ఎత్తి చూపుతూ షర్మిల అనేక సందర్భాల్లో మీడియాతో మాట్లాడారు. తాజాగా ఆమె వివేకా హత్య కేసుని ప్రస్తావిస్తూ.. ఆయన కుమార్తె సునీతకు ప్రాణ హాని ఉందంటూ సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఎంపీ అవినాష్‌రెడ్డి బెయిల్ పై బయట ఉంటూ సాక్షులను బెదిరిస్తున్నారని ఆరోపించారు షర్మిల. వివేకా హత్య కేసులోని సాక్షులు ఒక్కొక్కరిగా ప్రాణాలు కోల్పోతున్నారని.. అధికారుల్ని కూడా అవినాష్ రెడ్డి బెదిరిస్తున్నారని చెప్పారు. పరోక్షంగా జగన్ పై కూడా ఆరోపణలు చేశారు షర్మిల.ఇన్నాళ్లూ షర్మిల వ్యాఖ్యలకు వైసీపీ నుంచి పెద్దగా కౌంటర్లు ఉండేవి కావు. ఒకవేళ ఫ్యూచర్ లో అన్న, చెల్లెలు కలిసిపోతే తమ సంగతి ఏంటనే భయంతో చాలామంది వైసీపీ నేతలు షర్మిల వ్యాఖ్యలపై స్పందించేవారు కాదు. కానీ ఇప్పుడు తొలిసారిగా మాజీ మంత్రి రోజా, షర్మిల కామెంట్లపై కాస్త ఘాటుగా స్పందించారు. చంద్రబాబు చెప్పుచేతల్లో ఉన్న ఆమె జగన్ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. అసూయ, ద్వేషంతో చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారి షర్మిల రాజకీయాలు చేస్తున్నారని అన్నారు రోజా. వివేకాను తామే చంపామని టీవీల్లో చెప్పినవారిని, అసలు హంతకులను అప్రూవర్లుగా మార్చి, వారికి బెయిల్ వచ్చేలా చేసి, వారిని నిరంతరం కాపాడుతున్నారని, హంతకుల్నే ఇప్పుడు హీరోలుగా చూపిస్తున్నారని వండిపడ్డారు. చంద్రబాబుకు మేలు చేయాలన్నదే షర్మిల తాపత్రయం అని, అదే ఆమె లక్ష్యం అని, ఆ విషయం ప్రజలకు పూర్తిగా అర్థమవుతోందని చెప్పారామె. చివరికి జగన్ ని ఇబ్బందిపెట్టడమే షర్మిల అసలు గమ్యం అని అన్నారు. ప్రస్తుతానికి రోజా వ్యాఖ్యలను షర్మిల సీరియస్ గా తీసుకున్నట్టు లేదు. అయితే ఆ వెంటనే షర్మిల మరోసారి జగన్ ని టార్గెట్ చేస్తూ కౌంటర్లివ్వడం విశేషం. వివేకే హత్య కేసులో జగన్ ని పరోక్షంగా టార్గెట్ చేసిన ఆమె, సరస్వతి పవర్ షేర్ల బదిలీ విషయంలో అన్నను నేరుగా టార్గెట్ చేసి మాట్లాడారు. సొంత అమ్మకి బదిలీ చేసిన షేర్లను ఆయన తిరిగి అడుగుతున్నారని విమర్శించారు. తల్లిపై కేసు వేసిన కొడుకుగా.. మేనల్లుడు, మేనకోడలి ఆస్తులు కాజేసిన మేనమామగా జగన్ చరిత్రలో మిగిలిపోతారన్నారు. జగన్‌కు విశ్వసనీయత ఉందో లేదో ఆ పార్టీ నేతలు ఆలోచించుకోవాలన్నారు.ఆస్తులు కాజేసిన మేనమామ అంటూ షర్మిల చేసిన వ్యాఖ్యలకు వైసీపీ కౌంటర్లు రెడీ చేస్తోంది. బహుశా ఆ బాధ్యతను పార్టీ నేతలు రోజాకు అప్పగించినట్టున్నారు. ఇప్పటికే చంద్రబాబు చేతిలో కీలుబొమ్మ అంటూ రోజా, షర్మిలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ రోజా వ్యాఖ్యలకు షర్మిల స్పందిస్తే అప్పుడు అసలు కథ మొదలైనట్టు. ఇప్పటి వరకూ లైటర్ వే లో ఉన్న వాగ్యుద్ధం ఇక చినికి చినికి గాలివానలా మారే ప్రమాదం ఉంది.

## జగ్జీవన్ రామ్ సేవలు...



చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో క్రియాశీలంగా పాల్గొన్నారని.... అనంతరం దేశ స్వయంపాలనలో కేబినెట్ మంత్రిగా కార్మిక శాఖలో అనేక సంస్కరణలను తీసుకొచ్చారని కితాబునిచ్చారు. దేశ రక్షణ, వ్యవసాయం, టెలి కమ్యూనికేషన్స్ శాఖలకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని చెప్పారు. ఉప ప్రధానిగా దేశానికి ఎంతో సేవ చేశారని అన్నారు. ఆయన జయంతిని సమతా దివస్ గా జరుపుకోవడం... జాతి కోసం వారు చేసిన సేవలకు దర్పణంగా నిలుస్తుందని అన్నారు. అంటరానితనం, కులం పేరుతో కొనసాగుతున్న సామాజిక వివక్ష సంపూర్ణంగా సమసిపోయే దిశగా మనందరం పని చేసినప్పుడే బాబు జగ్జీవన్ రామ్ కు ఘనమైన నివాళి అర్పించిన వారమవుతామని చెప్పారు.

## పెట్టుబడులు పెట్టేందుకు ...

మేలు చేస్తుందని తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరం (జీఐబీఎఫ్) ఆధ్వర్యంలో పార్క్ హయత్‌లో నిర్వహించిన "ఇండియా-లాటిన్ అమెరికా, కరేబియన్ కంట్రీస్ బిజినెస్ కాంక్లేవ్" రెండో ఎడిషన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు భారత్ వైపు చూస్తున్నారని అన్నారు. ఈ పరిణామాన్ని అనుకూలంగా మార్చుకొని ఎక్కువ పెట్టుబడులు ఆకర్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. తెలంగాణ ఎంఎస్ఎంఈలు ప్రపంచవ్యాప్తంగా సత్తా చాటేలా ప్రత్యేక పాలసీని తీసుకువచ్చామన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని అన్నారు. జహీరాబాద్ నిమ్జ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆరు అంతర్జాతీయ స్థాయి సంస్థలు ముందుకు వచ్చాయని తెలిపారు. ఇందులో మూడు కొరియా కంపెనీలు ఉన్నట్లు వెల్లడించారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనుకూలతలను వివరించి, పెట్టుబడులు పెట్టేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామన్నారు.

## వక్ఫ్ బిల్లు త్వరలోనే చట్టంగా...

పురందేశ్వరి చెప్పారు. ముస్లింల మతపరమైన స్వేచ్ఛలో కేంద్ర ప్రభుత్వం తలదూర్చలేదని అన్నారు. రైల్వే, డిఫెన్స్ తర్వాత ఎక్కువ భూమి ఉన్నది వక్ఫ్ బోర్డు దగ్గరేనని చెప్పారు. వక్ఫ్ భూములను సరిగ్గా వినియోగిస్తే మైనార్టీల ఇబ్బందులు దూరమవుతాయని అన్నారు. వక్ఫ్ బోర్డులో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించారని చెప్పారు. పీఎంఏవై కింద మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు ఇళ్లు కేటాయించిన ఘనత మోదీదని పురందేశ్వరి కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ కులాల యువతీ యువకుల కోసం స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియాలను మోదీ ప్రారంభించారని చెప్పారు. డిక్కీ అనే సంస్థను దళితుల కోసం మోదీ స్టార్ట్ చేశారని తెలిపారు.

## 2047కు ప్రతి ఒక్కరి ఇంట్లో...

పర్‌ఫెక్ట్‌గా ఉండాలని.. ఇన్ని సంవత్సరాలు అయినా డ్వాక్రా సంఘాలు, మెప్మా డేటాను పర్‌ఫెక్ట్‌గా ఉంచుకున్నారని మంత్రి నారాయణ తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సౌకర్యాలు చేయాలన్నా డేటా పర్ఫెక్ట్‌గా ఉండాలని మంత్రి నారాయణ సూచించారు. ఈ విషయంలో తాను నిజంగా సంతోష పడుతున్నానని చెప్పారు. 2047కు ప్రతి ఒక్కరి ఇంట్లో వ్యాపారవేత్తలు ఉండాలని సీఎం చంద్రబాబు చెబుతున్నారని అన్నారు. గతంలో ఇసుక కాంట్రాక్టులు డ్వాక్రా గ్రూపులకు ఇచ్చారని.. కొన్ని అనివార్య కారణాలవల్ల అది అమలు జరుగలేదని తెలిపారు. 80 వేల సంఘాలకు రూ. 8 కోట్లు ఇవ్వాలని ముందుకు వెళ్తున్నామని తెలిపారు. 26 జిల్లాలకు మీటింగ్‌లు పెట్టాలని అనుకుంటున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## బియ్యానికి మోదీ ప్రభుత్వమే...



ఇవి మోదీ ప్రభుత్వం అందిస్తున్న బియ్యమేనని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేటలో బీజేపీ కార్యకర్తలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఉన్న ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తే, పోలీసుల సహాయంతో వాటిని తొలగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటోను ఏర్పాటు చేసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అదే సమయంలో ప్రధానమంత్రి ఫొటోను కూడా పెట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాస్త విజ్ఞతతో వ్యవహరించాలని సూచించారు. బియ్యం విషయంలో రాష్ట్రం ప్రభుత్వం వాటా ఎంత ఉందో చెప్పాలని బండి సంజయ్ కోరారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటి నుంచి లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తూనే ఉందని గుర్తు చేశారు. ఇన్నేళ్లకు ఇప్పుడు సన్న బియ్యం పంపిణీ చేయడం మొదలు పెట్టారని అన్నారు.

## దాంట్ల.సుబ్రమణ్యరెడ్డి మృతి దేహానికి నివాళులర్పించి.....

## ఆర్థిక సహాయం చేసిన మోహన్ మురళి



వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 05: వెదురుకుప్ప మండలం చవటగుంట గ్రామానికి చెందిన దాంట్ల, సుబ్రమణ్య రెడ్డి శుక్రవారం రాత్రి మృతి చెందారు విషయం తెలుసుకున్న వెదురుకుప్పం టిడిపి క్లస్టర్ ఇంచార్జి మాజీ మండల అధ్యక్షులు మోహన్ మురళి నివాళు లర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్తిక సహాయం అంద జేశారు. నివాళులర్పించిన వారిలో మండల టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు బండి ఢిల్లీ ప్రసాద్ రెడ్డి,పేట.జ్ఞానేందర్ రెడ్డి,పేట.పరమేశ్వర్ రెడ్డి, బండి. జ్ఞానందరెడ్డి, దాంట్ల. కేసువులు రెడ్డి,పంచాయతీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్,వినోద్ దదితరులు నివాళి అర్పించారు.

## డాక్టర్ జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలు



వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 05: డాక్టర్ జగ్జీవన్ రావ్ 118 వ జయంతి శుభాకాంక్షలు తెలియజేయుచున్న పెరుమాళ్ళపల్లి గ్రామపంచాయతీ సర్పంచి సెక్రటరీ సచివాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు అందరూ పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఘనంగా .....

## బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు...



పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 05: పలమనేరు నియోజకవర్గం పలమనేరు వంద పడకల ఏరియా ఆసుపత్రిలో జిల్లా వైద్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు భారతదేశ ఉప ప్రధాని స్వాతంత్ర సమర యోధులు దివంగత,కీర్తిశేషులు బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఆయన చిత్రపటానికి నివాళులు అర్పిస్తూ ఘనంగా జరపడం జరిగింది. భారత దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడుతూ స్మరించుకోవడం జరిగింది. డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ, అంట రానితనం అనే రుగ్మతను పాల ద్రోలుతో సమానత్వం అనే నినాదంతో ఆ కాలంలోనే కృషి చేసిన మహానుభావుడని కొనియా డారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసు పత్రి సూపరిండెంట్ మమతారాణి, ఆఫీస్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగ రాజు మరియు సభ్యులు,పలువురు వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మ అనాధ మహిళ వృద్ధ ఆశ్రమంలో .....


## డాక్టర్ చంద్రప్ప జన్మదిన వేడుకలు



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 05: శ్రీకాళహస్తి తొట్టంబేడు మండలం అమ్మ అనాధ మహిళా వృద్ధాశ్రమంలో బిజెపి తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప జన్మదిన వేడుకలు. అమ్మ అనాధ మహిళ వృద్ధాశ్రమం నందు చంద్రప్ప పుట్టి నరోజు సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధుల కు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ్రమ వ్యవస్థాపకురాలు భూలక్ష్మిచంద్రప్ప సతీమణి కళ్యాణి దుస్సాలువతో సత్కరిం చి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్య క్రమంలో శ్రీరామ్ నగర్ కాలనీ పోలింగ్ బూత్ అధ్యక్షులు అరుణ, ప్రియాంక, బిజెపి నాయకులు గుత్తి త్యాగరాజు, రామానుజులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డా.బాబు జగజ్జీవన్ రామ్ జయంతి

శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 05:శ్రీకాళహస్తి శ్రీరామ్ నగర్ కాలనీ భారతీయ జనతా పార్టీ 109వ పోలింగ్ బూత్ లో డా.బాబు జగజ్జీవన్ రామ్ జయంతి తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు డా.చంద్రప్ప బిజెపి కార్యకర్తలుతో ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుత్తి త్యాగరాజు, ప్రియాంక, జ్ఞానశేఖర్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా జగ్జీవన్ రామ్ 117వ జయంతి




పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 05: అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణంలో భారతీయ అంబేద్కర్ సేన కార్యాలయంలో బాబు జగ్జీ వన్ జయంతి వేడుకలు జిల్లా నాయకులు ముల్లంగి కృష్ణయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి డివిఎంసి సభ్యులు బాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నమయ్య జిల్లా డివిఎంసి సభ్యులు భారతీయ అంబేద్కర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు, మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధరణి కుమార్ లు మాట్లాడుతూ...నిరుపేద కుటుంబంలో జన్మించి దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోసించే స్థాయికి చేరుకున్న బాబు జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని వీరు కొనియాడారు. దేశానికి విజయం అందించడంలో ఆయన చేసిన కృషి గర్వించదగ్గ విషయమని, అన్నారు. ఈ కార్యక్రమంలోభారతీయ అంబేద్కర్ సేన నాయకులు ముల్లంగి కృష్ణయ్య, పల్లెపోగు హరినాథ్, ముల్లంగి గురవయ్య, సంధిపాగు రామకృష్ణ, రాంబాబు, సురేంద్ర మహేష్,రమణ ,మాలమహానాడు నాయకులు జెట్టి దుర్గాప్రసాద్, తుమ్మల రవిచంద్ర, ఆర్వెంటి రెడ్డప్ప, జి.రాజేంద్ర బాబు, తుమ్మల రవికుమార్ బీసీ నాయకులు సువర్ణ మల్లయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర




పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్05: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేర్ పట్టణంలోని మదనపల్లి రోడ్డులో గల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శనివారం పెద్ద పంజాణి మండలం కొలత్తూరు ప్రాథమి కోన్నత పాఠశాల ఉపాధ్యాయులు వీ.కే. నగేష్ పదవి విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దే శించి ఆయన ప్రసంగించారు. ప్రభుత్వాల ఏర్పాటులో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమైందన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పా టులోనూ ఉపాధ్యాయులు చేసిన కృషిని ఆయన కొనియాడారు. ఉద్యోగ, ఉపాధ్యా యులకు ప్రభుత్వం అన్ని రకాల తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయు లకు ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వానికి విన్నవించి సహకరిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన నగేష్ ను సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నూతన విద్యా విధానంతో ఎదురవుతున్న సమస్యలపై పలువురు ఉపాధ్యాయులు ఆయనకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా య సంఘం నాయకులు గురురాజారావు, తులసినాథం నాయుడు, సోమచంద్రా రెడ్డి,ప్రభాకర్ రెడ్డి, ప్రసన్న కుమార్ లతో పాటు టిడిపి నాయకులు సోమశేఖర్ గౌడ్, కుట్టి,గిరిబాబు ఖాజా,మదన్,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల యూత్ జిల్లా అధ్యక్షులుగా సోమరాజు ఎన్నిక.



పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్05: జాతీయ మానవ హక్కులు, నిర్మూలన సంస్థ అనుబంధ సంఘం జిల్లా యూత్ ప్రెసిడెంట్ గా సోమరాజును ఎన్నిక చేసి నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు డి.వి. మునిరత్నం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా పలమనేర్ పట్టణంలో పార్థసారథి అధ్యక్షతన సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సోమరాజు యుక్త వయసు నుండి అనేక సేవా కార్య క్రమాల్లో చురుగ్గా పాల్గొని అందించిన సేవలను గుర్తించి మొదట పలమనేర్ నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ గా ఎన్నిక చేయడం జరిగిందన్నారు. ఈ మధ్యకాలం లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం, అనార్తులను ఆదుకోవడంలో చేసిన కృషిని జాతీయ,రాష్ట్ర ,జిల్లా కమిటీలు గుర్తించి చిత్తూరు జిల్లా యువజన సంఘం అధ్యక్షు లుగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. సోమ రాజు మాట్లాడుతూ జాతీయ మానవ హక్కుల సంస్థ తనపై పెట్టిన నమ్మకాన్ని కొమ్ము చేయకుండా జిల్లా నలుమూలల పర్యటించి యువజన సంఘాలు ఏర్పాటు చేసి వారి హక్కులు కోసం కృషి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సోమ రాజుకు, మహిళ నాయకులు సరస్వతి, చంద్రకళ,శ్యామల,శ్రీదేవి,మానవ హక్కుల నాయకులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, గుర్రం సుబ్రహ్మణ్యం,మురళి,శివ, తది తరులు పట్టు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు సోమరాజు జిల్లాలో ఉన్న యువత సమ స్యల పరిష్కారానికి కృషిచేసి భవిష్యత్తు లో రాష్ట్ర యూత్ అధ్యక్షులుగా ఎదగాలని ఆకాంక్షించాచారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు కార్య కర్తలు, పెద్ద ఎత్తున పాల్గొని సోమరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

### శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ...

# శ్రీరామనవమి వేడుకలో పాల్గొన్న డా. చంద్రప్ప





శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 05: శ్రీకాళహస్తి ముత్యాలమ్మ గుడి వీధి శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో శ్రీరామనవమి వేడుకలు కమిటీ మెంబర్లు ఆధ్వర్యంలో ప్రధాన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయురాలు విద్యార్థిని విద్యార్థుల నడుమ సాంప్రదాయబద్ధంగా శ్రీరాముని చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప పాల్గొన్నారు తన జన్మదినం సందర్భంగా చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సరస్వతి శిశు మందిర్ అధ్యాపక బృందం, ముఖ్య అతిధులు మర్యాదపూర్వకంగా చంద్రప్ప దృశ్యాలువతో సత్కరించి శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యాపీఠం జ్ఞాపికను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

### విద్యార్థులు ప్రముఖ జాతీయ నాయకుడు .....

# బాబూ జగ్జీవన్ రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

### బి.సి.ఎన్ విద్యాసంస్థల చైర్మన్ బి.సి నాగరాజ్




కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 05:కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ లో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)ఆధ్వర్యములో ప్రముఖ జాతీయ నాయకుడు,సామాజిక న్యాయం కోసం పోరాడిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి ని ఏప్రిల్ 5న ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బి.సి. ఎన్ విద్యాసంస్థల చైర్మన్ బి.సి నాగరాజ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బాబుజీగా ప్రసిద్ధిచెందిన జగ్జీవన్ రామ్ అంటరానివారి శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహా నాయకుడని ఆయన జీవితం, సందేశాలు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని, బీహార్లోని చాంద్వాలో ఒక దళిత కుటుంబంలో జన్మించిన జగ్జీవన్ రామ్ చిన్నతనంలోనే వివక్షను ఎదుర్కొ న్నారని, వివక్షను ఎదుర్కొన్నప్పటికీ అతను విద్యను అభ్యసించి బనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి,కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రుడ య్యారని తెలిపారు, చదువుకునే సమయంలో వివక్షను ఎదుర్కొన్న సంఘటనలు సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడాలనే అతని దృఢ సంకల్పానికి ఆజ్యం పోశాయి ఈ సందర్భం గా గుర్తుచేశారు. జాతిపిత మహాత్మాగాంధీ అభిప్రాయాలతో జగ్జీవన్ రామ్ ఎక్కువగా ఏకీభవించేవారాని అంటరానితనాన్ని నిర్మూలించడానికి గాంధీ చేసిన ప్రయత్నా ల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారని, దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ, సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల్లో గాంధీజీ వెంట నడిచార ని, ఆయన నడిచిన బాట..అనుసరించిన ఆదర్శాలు.. చూపిన సంస్కరణ మార్గాల నూ జీవితాన్ని నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేసారు. ఈ సంద ర్భంగ ఆయన జగ్జీవన్ రామ్ గారి ఫోటో కు పూలమాల వేసి అంజలిఘటించారు. ఈ కార్యక్రమములో కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.సుధాకరబాబు,వైస్ ప్రిన్సిపాల్ డా.ఎస్ భాస్కరన్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జె.మాధవన్ ,కోఆర్డినేటర్ గంగా ధరన్,వీఆర్వో ప్రవీణ్ కుమార్, విభాగాధి పతులు,అధ్యాపకులు,విద్యార్థులు, ఎన్ ఎస్ఎస్ వాలింటర్స్ పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగజ్జీవన్ రావు వేడుకలు



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 05: శ్రీకాళహస్తి స్వాతంత్ర సమరయోధులు సంఘసంస్కర్త, భారత ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రావు జయంతి సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి బాబూ అగ్రహారం మునిసిపల్ హైస్కూల్ నందు ఘనంగా నిర్వహించారు. అయన చిత్రపటం వద్ద భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పుష్పాలతో నివాళులు అర్పించారు. అయన బడుగు, బలహీన వర్గాల కోసం బాబు జగజ్జీవన్ రావు చేసిన కృషి గురించి గుర్తుకు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ చైర్మన్ అజారుద్దీన్, స్కౌట్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో .....

## బాబు జగ్జీవన్ రామ్ కు ఘన నివాళి




వరదయ్యపాలెం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 05: భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా వరదయ్య పాలెం తహసీల్దార్ కార్యాలయం లో శనివారం ఘన నివాళి అర్పించారు. వరదయ్యపాలెం మండల తహసిల్దార్ కార్యాలయంలో తహ సీల్దార్ రాజశేఖర్ ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా అయన చిత్రపటాని కి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు మధు స్వామి, రవిరెడ్డి,వెంకటయ్య,రమణయ్య, మోహన్,సిబ్బంది,వీఆర్ఏ లు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో మెగా జాబ్ మేళా

**పాల్గొన నున్న 15 కంపెనీల ప్రతినిధులు**

**స్థానిక యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి**



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 05: శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్ ఎస్ కళ్యాణ మండపంలో ఏప్రిల్ 15వ తారీఖున మెగా జాబ్ మేళా నిర్వహించ బడుతుందని శనివారం నాడు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం జాబ్ మేళాలో 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొని స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తారని తెలియజేశారు. స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతీ,యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిని సన్మానించిన .....

## విశ్వకర్మ యువజన సేవా సమితి నాయకులు



ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 05: జీడి నెల్లూరు నియోజకవర్గ ఏపీయూ డబ్ల్యూజే యూనియన్ అధ్యక్షులు ఎన్టీవీ రిపోర్టర్ తిరుమల ను శనివారం ఎస్ఆర్ పురం నియోజకవర్గ ప్రెస్ క్లబ్లో విశ్వకర్మ యువజన సేవా సమితి సంఘం నాయ కులు సన్మానించారు. ఈ విశ్వకర్మ యువ జన సేవా సమితి అధ్యక్షులు సుధాకర్ ఆచారి సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ ఎప్పటికప్పుడు నిజాన్ని నిర్భయంగా రాస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నది మీడియా అని అన్నారు. నియోజకవర్గ నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా అయినా మాంగాటీ తిరుమల ను ఈ సందర్భంగా సన్మానించి అభినంద నలు తెలపడం జరిగిందన్నారు. కార్యక్ర మంలో విశ్వకర్మ యువజన సేవా సమితి సభ్యులు జనార్ధన ఆచారి,వినాయక ఆచారి, నరేష్ ఆచారి,రామ్మూర్తి ఆచారి,నరసింహులు,పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి.

వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ ఏప్రిల్05: వీకోట మండలం వీకోట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్లో శనివారం రోజు బాబు జగ్జీవన్ రావు జయంతి ని బడుగు బలహీన వర్గాలు కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ గురించి మేధావులు మాట్లాడుతూ ఆయన ప్రజల కోసం చేసిన సేవలను కొనియాడినారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భారతీయ అంబేద్కర్ సేన నాయకులు గణపతి దొరస్వామి మరియు ఉపాధ్యాయులు జయప్ప, పలమనేరు బీఎస్పీ పార్టీ నేత వీకోట ఎన్ శ్రీనివాసులు, బీసీ కే పార్టీ నేత వినోద్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



చిత్తూరు ఎక్స్‌ప్రెస్

ఆదివారం 06-04-2025

### చవటగుంటలో అనారోగ్య కారణంగా ......

## 15రోజుల వ్యవధిలోనే తల్లిదండ్రులను కోల్పోయిన కుమారులు



వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 05: వెదురుకుప్పం మండలం చవటగుంట గ్రామానికి చెందిన దాంట్ల ఉమాశంకర్ రెడ్డి,బాలకృష్ణారెడ్డి తల్లిదండ్రులైన దాంట్ల కాంతమ్మ గత నెల 18-03-2025 అనారోగ్య కారణంగా మృతి చెందగా, తర్వాత 15రోజులు వ్యవధిలోనే తండ్రి దాంట్ల సుబ్రహ్మణ్యం రెడ్డి కూడా 04-04-2025 అనారోగ్య కారణంగా మృతి చెందడం జరిగింది ఈ అనుకోని సంఘటనతో కుమారులైన దాంట్ల ఉమాశంకర్ రెడ్డి, దాంట్ల బాలకృష్ణారెడ్డిని అనాథలు చేసి వెళ్లిపోవడంతో స్నేహితు లు,బంధువులు, చవటగుంట గ్రామప్రజలు శోకసముద్రంలో మునిగిపోయారు. తల్లి దండ్రులు కోల్పోయిన కుమారులని ఉమ్మడి కూటమీ ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

### అరటి ఆకుపై .....

## బాలరాముడి అద్భుత చిత్రం



గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 05: కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలంలోని చిత్ర కళాకారుడు పూరీ ఆర్ట్స్ పురుషోత్తం శ్రీరామ నవమి సందర్భంగా వినూత్న రీతిలో అరటి ఆకుపై అయోధ్యబాల రాముడి చిత్రాన్ని అద్భుతంగా రంగు లతో వేయడం. చిత్రాన్ని వినూత్నంగా వేయడంతో ప్రజలను విశేషంగా ఆకుట్టుకుంటోంది. పలువురు పురుషోత్తంను ప్రశంసించారు.

### కడపిడి కార్యాలయంలో ఘనంగా.....

## జగ్జీవన్ రామ్ జయంతివేడుకలు



కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 05: కుప్పం పట్టణములోని కడా పిడి కార్యాల యంలో శనివారంనాడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.కడాపిడి వికాస్ మరమ్మత్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ అణగారిన బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం అలుపెరగని కృషి చేసిన సంఘ సంస్కర్త,స్వాతంత్ర సమరయోధులు, దేశం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు.అనంతరం జగ్జీవన్ చిత్రపటానికి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జగన్ ను చుట్టేస్తున్న కేసులు

విజయవాడ : వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు గతంలో జరిగిన హత్య కేసులు మెడకు చుట్టుకునేలా ఉన్నాయి. ఒకవైపు పరిటాల సునీత తన భర్త పరిటాల రవి హత్యకు కారణం జగన్ అని ఆరోపించడం సంచలనం కలిగించింది. రెండు దశాబ్దాల క్రితం జరిగిన హత్య కేసులో జగన్ ప్రమేయం ఉందని ఆమె చెబుతూ హంతకులకు జగన్ ప్రోద్బలం ఉందని పరిటాల సునీత తెలిపారు. జగన్ సహకారంతోనే తన భర్త పరిటాల రవి హత్య జరిగిందన్న ఆరోపణలతో ఫ్యాన్ పార్టీ కొంత ఉక్కపోతకు గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పరిటాల రవి 2005లో హత్యకు గురయితే దాదాపు రెండు దశాబ్దాల తర్వాత అంటే 2025 లో పరిటాల సునీత జగన్ ప్రమేయం ఉందని ఆరోపించడం ఏంటని వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు.. పరిటాల రవి హత్య జరిగిన సమయంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన ఈ హత్యపై నాడు సీబీఐ విచారణకు కూడా ఆదేశించడానికి సిద్ధమయ్యారని వైసీపీ నేతలు వాదిస్తున్నారు. హత్యపై తర్వాత అనేక ప్రభుత్వాలు మారాయని, వారు విచారణ జరిపినా అసలు నిజం వెలుగు చూసి ఉండేదని చెబుతున్నారు. కానీ రెండు దశాబ్దాల తర్వాత ఇలాంటి ఆరోపణలు చేయడం కేవలం రాజకీయ ప్రేరేపితమైనవని కొట్టిపారేస్తున్నారు. అయితే సునీత చేసిన వ్యాఖ్యలు కొంత జగన్ తోపాటు పార్టీని కూడా ఇబ్బందిపెట్టేవే. ఇప్పటికీ పరిటాలకు వీరాభిమానులున్నారు. ముఖ్యంగా రాయలసీమలో రవి ప్రభావం అనేక నియోజకవర్గాల్లో ప్రభావం చూపే అవకాశముంది.మరోవైపు వైఎస్ వివేకానందరెడ్డి హత్య పై కూడా స్వయంగా సోదరి వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. జగన్ పేరు ప్రస్తావించకపోయినప్పటికీ అవినాష్ రెడ్డిని దోషిగా చూపుతూ ఆమె ఇచ్చిన ప్రకటనలు పార్టీకి ఇబ్బంది కలిగించేలా కనిపిస్తున్నాయి. వైఎస్ వివేకా మర్డర్ జరిగి కూడా ఆరేళ్లుదాటిపోయింది. సీబీఐ విచారణ కూడా చేపట్టింది. అయినా ఇంత వరకూ హత్యకు జరిగిన కారణాలను ఎవరూ గుర్తించలేకపోయారు. ఈ కేసులో కొందరు నిందితులు అరెస్టయినప్పటికీ, అన్నీ వేళ్లూ జగన్ నివాసం వైపు చూపుతున్నాయి. అవినాష్ రెడ్డిని జగన్ రక్షించడం వల్లనే కేసుల నుంచి తప్పించుకోగలిగారని వైఎస్ షర్మిల పరోక్షంగా విమర్శలను ఎక్కుపెట్టడం చర్చనీయాంశమైంది.

## పదవ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం








పాల్వంచ,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 05: స్థానిక మార్కెట్ ఏరియాలో గల స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ లో శనివారంనాడు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వ హించారు. ఈ ప్రత్యేక సందర్భంగా విద్యా ర్థుల ఆనందం, భావోద్వేగం మిళితమైన అపురూప క్షణాలను అందరూ ఆస్వాదిం చారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ జి భాస్కరరావు, ప్రిన్సిపాల్ జి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలో ఎదురు అయ్యే ప్రతి సవాలను అవకాశంగా మార్చుకొని తమ కల లను నిజం చేసుకోవాలని, తమ కున్న క్రమశిక్షణ ధైర్యం సమర్థత విజయా నికి మార్గదర్శకాలు కావాలని ఆకాంక్షించా రు. విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకుంటూ ఈ పాఠశాలలో పొందిన జ్ఞానం తమకు భవిష్యత్తులో మార్గ నిర్దేశం చేస్తుందని ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎప్పటికీ గుర్తుండి పోతుందని,ఈ పాఠశా లతో ఏర్పడిన అనుబంధం, పొందిన విద్య విలువలు ఆటలు పరీక్షల ఒత్తిళ్లు టీచర్ల శిక్షలు మరచిపోలేని మధురస్మృతులు గా మిగిలిపోతాయని భవిష్యత్తుకు బలమైన పునాదులు అవుతాయని భావోద్వేగంతో తెలియజేసినారు. ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి... పాట ప్రదర్శన ప్రతి ఒక్కరినీ భావో ద్వేగానికి గురి చేసినది.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### కుప్పం పట్టణములోని .....

## మున్సిపల్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతివేడుకలు

కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 05: కుప్పం పట్టణములోని మున్సిపల్ కార్యాలయంలో సమ సమాజ నిర్మాణం కోసం అవిశ్రాంతంగా పోరాట యోధులు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు,భారత మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ గాజయంతి సందర్భంగా ఆ మహానీయుని సేవలను గుర్తు చేసుకుంటూ,శనివారం నాడు ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ అణగారిన బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం అలుపెరగని కృషి చేసిన సంఘ సంస్కర్త,స్వాతంత్ర సమరయోధులు, దేశం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు.అనంతరం జగ్జీవన్ చిత్రపటానికి నివాళులర్పించారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దాము, కౌన్సిలర్లు,సోము,వేలు,బిజెపి నాయకులు శివశంకర్, జనసేన నాయకులు నరేష్,కార్యాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



# బెయిల్ ప్రదక్షిణలు...

విజయవాడ : ఏపీలో వైసీపీ నేతలకు అరెస్ట్ భయం పట్టుకుందా.. ఒక్కో శాఖలో జరిగిన తప్పులను తోడుతున్నారా.. తాజాగా లిక్కర్ స్కామ్ అలిగేషన్స్ పీక్ లెవల్‌కు చేరుకున్నాయి. ఇదే కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి, కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. దీంతో సీఐడీ విచారణ వేగవంతం చేస్తుందనే ప్రచారం ఊపందుకుంది. ఇటు మరో మాజీ మంత్రి కాకాణి సైతం పోలీసులకు చిక్కకుండా దోబూచులాడుతున్నారట. ఏపీలో వైసీపీ నేతలను అరెస్ట్ భయం వెంటాడుతోందనే టాక్ పొలిటికల్ సర్కిళ్లలో బిగ్ సౌండ్ చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో చేసిన తప్పులను వెతికే పనిలో పడింది కూటమి సర్కార్. ఏ నాయకుడు ఏ చిన్న తప్పు చేసినట్టు ఆధారం దొరికినా వదిలిపెట్టడం లేదు. కూపీలాగి జైల్లో కూర్చోబెడుతోంది. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ నుంచి మొన్న పోసాని కృష్ణమురళి వరకు ఇదే తంతూ జరిగింది.తాజాగా ఏపీలో జరిగిన లిక్కర్ స్కామ్ మళ్లీ తెరపైకి వచ్చింది. ఏపీలో వైసీపీ హయాంలో ఎక్సైజ్ శాఖలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని కూటమి సర్కార్ మొదటి నుంచి చెప్పుకుంటూ వస్తోంది. ప్రభుత్వమే మద్యం షాపులు తెరిచి విక్రయాలు చేసిందని ఆరోపిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో రకరకాల మద్యం బ్రాండ్లు తెచ్చి వేల కోట్ల రూపాయల అవినీతి చేశారని లెక్కలు బయటపెడుతోంది.అయితే మద్యం కుంభకోణం కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఉచ్చు బిగుసుకునేలా ఉందనే ప్రచారం ఇప్పుడు ఊపందుకుంది. మిథున్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వైసీపీ హయాంలో భారీ మద్యం కుంభకోణం జరిగిన సంగతి తెలిసిందే.

దీనిపై గతేడాది సెప్టెంబరు 23న సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఏపీ బెవరేజ్ కార్పొరేషన్ అప్పటి ఎండీ వాసుదేవరెడ్డిని విచారించారు. ఆయన ఇచ్చిన 161 స్టేట్‌మెంట్‌ను పరిశీలిస్తే నచ్చిన కంపెనీలకు మద్యం ఆర్డర్లు ఇవ్వడంలో మిథున్‌రెడ్డి కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. దీంతో తనను ఎక్కడ అరెస్టు చేస్తారేమో అనే భయంతో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని ప్రచారం జరుగుతోంది.మరోవైపు మద్యం కేసులో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి కూడా హైకోర్టులో చుక్కెదురైంది. సీఐడీ నోటీసులను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేశారు కసిరెడ్డి. విచారణ జరిపిన న్యాయస్థానం కసిరెడ్డి పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఈ కేసులో కర్త కర్మ క్రియ అంతా కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డే అంటూ ఒకప్పటి వైఎస్సార్సీపీ ఎంపి విజయసాయిరెడ్డి కూడా ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఈకేసులో సీఐడీ వేగం పెంచుతుందనే అంచనాలు నెలకొన్నాయ్.గత ప్రభుత్వ హయాంలో భారీగా లిక్కర్ స్కామ్ జరిగిందని.. ఇది ఢిల్లీకంటే చాలా పెద్దదని టిడిపి ఎంపీ లావు కృష్ణదేవరాయలు పార్లమెంట్‌లో ప్రకటించడం..తర్వాత హోంమంత్రి అమిత్‌షాని కలవడం కూడా గుర్తుండే ఉంటుంది. తన దగ్గరున్న ఆధారాలను కూడా ఆయన ఏపీ సీఎం చంద్రబాబుకి వివరించారు. ఈ పరిణామాలన్నీ కూడా సీఐడీ దూకుడుకు దోహదపడేలా ఉన్నాయి.ఇదిలా ఉంటే మరో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి సైతం అరెస్ట్ భయంపట్టుకుదని ప్రచారం ఏపీ పాలిటిక్స్‌లో చక్కర్లు కొడుతోంది. నెల్లూరు క్వార్జ్ అక్రమ తరలింపు కేసులో విచాణకు రావాలని మూడు సార్లు పోలీసులు నోటీసులు ఇచ్చినా.. ఆయన విచారణకు రావడం లేదు. విచారణ మాట పక్కన పెడితే అసలు కాకాణి పోలీసులకు అందుబాటులోకి రావడం లేదు.సోషల్ మీడియాలో మాత్రం తాను హైదరాబాద్‌లోనే ఉన్నానని పోస్టులు పెడుతున్నారు. మరోసారి కార్యకర్తలకు ఫోన్ చేసి తాను నెల్లూరులోనే ఉన్నట్లు చెబుతున్నారట. ఇలా కాకాణి ఎక్కడ ఉన్నారో క్లారిటీ ఇవ్వకుండా పోలీసులతో దోబూచులాడుతున్నారని పొలిటికల్ సర్కిళ్లలో వినిపిస్తున్న టాక్.ఏది ఏమైనా కొందరు వైసీపీ నేతలు ముందస్తు బెయిల్ కోసం కోర్టుల చుట్టు తిరుగుతున్నారు. మరికొందరు నేతలు మాత్రం విచారణకు పిలిచినా రాకుండా తిరుగుతున్నారు. భవిష్యత్‌లో ఏపీలో ఇంకెన్ని పరిణామాలు చోటుచేసుకుంటాయోనని ఉత్కంఠను క్రియేట్ చేస్తోంది

## స్టీల్ ప్లాంట్ నుంచి 3,823 ఉద్యోగులు తొలగింపు

### సమ్మెకు సిద్ధమౌతున్న కార్మిక సంఘాలు

విశాఖపట్టణం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు విషయంలో యాజమాన్యం వెనక్కి తగ్గడం లేదు. దశలవారీగా తొలగిస్తున్నారు. ఇప్పటి వరకు రెండు దశల్లో 2,603 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించారు. ఇప్పటకే 1,223 మంది పర్మినెంట్ ఉద్యోగులు వీఆర్ఎస్ తీసుకున్నారు.రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక ప్రభుత్వ రంగ సంస్థ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ -ఆర్ఐఎన్ఎల్) ప్రైవేటీకరణ పనులు చకచక జరుగుతున్నాయి. ఒకపక్క అధికార టీడీపీ నేతలు ప్రైవేటీకరణ కాదని చెబుతున్నారు. కానీ మరోవైపు వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో చోటు చేసుకున్న పరిణామాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అనుకూల విధానాలు అమలు జరుగుతున్నాయి. పెద్ద ఎత్తున కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు జరుగుతోంది. పర్మినెంట్ ఉద్యోగులను వీఆర్ఎస్ ద్వారా ఇంటికి పంపించే చర్యలు చేపడుతున్నారు.వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో మూడు నెలలకు 1,400 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించాలని, అలా ఏడాదికి 5,600 మంది ఉద్యోగులను తొలగించాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగానే గతంలో 1,100 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించగా, తాజాగా మరో 1,503 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను ఇంటికి పంపారు. మరో 440 మంది కాంట్రాక్ట్ కార్మికులను రెన్యూవల్ చేయకుండా బయట ఉంచారు. వారిని విధుల్లోకి తీసుకోవాలని రీజినల్ లేబర్ కమిషనర్ వద్ద చర్చలు కొనసాగుతున్నాయి.ఉక్కు మంత్రిత్వ శాఖ నుంచి యాజమాన్యంపై రోజు రోజుకు పెరుగుతున్న ఒత్తిడి కారణంగా.. ప్రతిరోజూ వందల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగిస్తున్నారు. మొదటిలో మెడికల్ ఫిట్‌నెస్ లేనివారిని, 55 ఏళ్ల పైబడినవారిని తొలగించాలని యాజమాన్యం నిర్ణయించింది. అందుకు సంబంధించిన జాబితాను విడుదల చేసింది. స్టీల్‌ప్లాంట్‌లో దాదాపు 15,000 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, దాదాపు 10,000 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఉన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో ఇప్పటి వరకు 2,603 మందిని తొలగించారు. పర్మినెంట్ ఉద్యోగుల్లో 1,223 మంది వీఆర్ఎస్ తీసుకున్నారు.ఇలా దశలవారీగా కాంట్రాక్ట్ ఉద్యోగులు, పర్మినెంట్ ఉద్యోగులు సంఖ్యను తగ్గిస్తున్నారు. ఉద్యోగుల సంఖ్య తగ్గుదల స్టీల్ ఉత్పత్తిపై ప్రభావం చూపుతుందని, ఇప్పటికే సెయిల్‌తో పోల్చితే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులు తక్కువగా ఉన్నారని ఉద్యోగ, కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఇప్పుడు ఉద్యోగులను తగ్గించడంతో మరింత నష్టం వాటిల్లుతుందని అన్నారు.వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో సమ్మె సైరన్ మోగింది. ఈనెల 16 నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగుతున్నారు. మొత్తం 15,000 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు సమ్మెకు వెళ్లనున్నట్లు అఖిలపక్ష కార్మిక సంఘాల జేఏసీ నిర్ణయం తీసుకుంది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం దిగొచ్చే వరకు సమ్మె చేపట్టాలని నిర్ణయించింది. సమ్మెకు ముందుగా శనివారం కూర్మన్నపాలెంలో భారీ రాస్తారోకో చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈనెల 7న రీజనల్ లేబర్ కమిషనర్‌తో మరోసారి చర్చలు జరపాలని నిర్ణయించింది. అలాగే ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. అనంతరం సమ్మెలోకి కాంట్రాక్ట్ ఉద్యోగులు వెళ్లనున్నారు

## 19న అవిశ్వాస తీర్మానం

విశాఖపట్టణం : విశాఖ రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. అవిశ్వాస తీర్మాన రాజకీయం అనేక మలుపులు తిరుగుతోంది. ఇప్పటివరకు ఒక ఎత్తు.. ఇకనుంచి మరో ఎత్తు అన్నట్టు పరిస్థితి ఉంది. అవిశ్వాస తీర్మానం గెలిచేందుకు అవసరమైన వ్యూహాన్ని టిడిపి కూటమి అనుసరిస్తుంది. అవిశ్వాసాన్ని ఎదుర్కొనేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధపడుతోంది. ఈ క్రమంలో జరుగుతున్న పరిణామాలు హాట్ టాపిక్ గా మారుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందు జాగ్రత్త చర్యగా తమ కార్పొరేటర్ లను సేఫ్ జోన్ లోకి పంపింది. బెంగళూరు శిబిరానికి తరలించినట్లు తెలుస్తోంది. మరోవైపు జనసేన సైతం తాజాగా జాగ్రత్తలు పడినట్లు సమాచారం. టిడిపి సైతం తమ కార్పొరేటర్ లను ఏకంగా దేశం దాటించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం సాగుతోందిగ్రేటర్ విశాఖలో 98 డివిజన్లు ఉన్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 58 చోట్ల విజయం సాధించి గ్రేటర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. 29 స్థానాలతో ద్వితీయ స్థానంలో నిలిచింది తెలుగుదేశం పార్టీ. జనసేన నుంచి ముగ్గురు గెలిచారు. వామపక్షాలతో పాటు బిజెపి ఒక్కో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఓ అయిదు చోట్ల ఇండిపెండెంట్ ల సైతం గెలుపొందారు. అయితే ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది కార్పొరేటర్లు గుడ్ బై చెప్పారు. టిడిపి తో పాటు జనసేనలో చేరిపోయారు. దీంతో ఆ పార్టీ బలం తగ్గింది. అదే సమయంలో జనసేన బలం 11 కు పెరిగింది. ఓ పదిమంది వరకు తెలుగుదేశం పార్టీకి జై కొట్టారు. మరో 12 మంది వరకు ఎక్స్ ఆఫీసుయో సభ్యులు ఉన్నారు. దీంతో సునాయాసంగా గ్రేటర్ పీఠాన్ని కైవసం చేసుకోవచ్చని భావిస్తోంది టిడిపి.ఈ నెల 19న జీవీఎంసీలో మేయర్ పై అవిశ్వాస తీర్మానం పెడతారని తెలుస్తోంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. కూటమికి సరిపడినంత బలం లేదని వైసీపీ చెబుతోంది. తమ పార్టీ కార్పొరేటర్లు తమ శిబిరంలోనే ఉన్నారని చెప్పుకొస్తోంది. అయితే నాలుగు దశాబ్దాల తర్వాత మేయర్ పీఠం టిడిపికి వస్తుండడంతో ఆ పార్టీ గట్టి ప్రయత్నాలు చేస్తోంది. రెండు రోజుల కిందట ఉమ్మడి విశాఖ జిల్లా పర్యటనకు వచ్చారు నారా లోకేష్. ఆ సమయంలో పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. అందుకే టిడిపి నేతలు ఒక వ్యూహం ప్రకారం వైయస్సార్ కాంగ్రెస్ కార్పొరేటర్ లను తమ వైపుకు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.ఇంతవరకు జనసేనకు ఉన్న కార్పొరేటర్ల బలం 11. జనసేన ఇంతవరకు వారిని ఎటువంటి శిబిరాలకు తరలించలేదు. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో డిప్యూటీ మేయర్ పదవిని జనసేన కోరుతున్నట్లు సమాచారం. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఇద్దరు డిప్యూటీ మేయర్లు ఉన్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా జనసేన కొత్త షరతు పెడుతోంది. మేయర్ పదవి టిడిపి తీసుకుంటే.. ఏకైక డిప్యూటీ మేయర్ పదవిని తమకు విడిచి పెట్టాలని జనసేన డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇదే విషయంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ కూడా మాట్లాడారు. డిప్యూటీ మేయర్ పోస్ట్ కోసం ఆ రెండు పార్టీల మధ్య గొడవ జరుగుతోందని చెప్పుకొచ్చారు. విశాఖ మేయర్ తో పాటు డిప్యూటీ మేయర్ పోస్టులను సైతం తామే పదిలం చేసుకుంటామని.. అవిశ్వాస తీర్మానాన్ని ఓడించి తీరుతామని ఆయన నమ్మకంగా చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## అనిల్ యాదవ్ గాయబ్

నెల్లూరు : నెల్లూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఎక్కడా..? వైసీపీలో ఫైర్ బ్రాండ్‌గా ఉన్న నేత ఎప్పుడెందుకు సైలెంట్ అయ్యారు. పార్టీకి దూరంగా ఉంటున్నారా.. క్యాడర్‌కి కటీఫ్ చెప్పేశారా. నో పాలిటిక్స్.. ఓన్లీ బిజినెస్ అంటూ అనిల్ తిరుగుతున్నారనే గాపిప్స్ చక్కర్లు కొడుతున్నాయి. పార్టీలో నెంబర్-2 గా వ్యవహరించిన వారు సైతం పక్కకు తప్పుకున్నారు. ఇదే క్రమంలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ఎక్కడ అనే క్వశ్చన్ ఏపీ పొలిటికల్ సర్కిళ్లలో బిగ్ సౌండ్ చేస్తోంది.మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ అంటే ఫైర్ బ్రాండ్. ఆయన అధికారంలో ఉన్నప్పుడు మైక్ పట్టుకుంటే అంతే సంగతీ.. ఆయన అగ్రెసివ్‌నెస్‌కి సపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉండేది. ఎవరైనా తమ పార్టీ అధినేత జగన్‌ను విమర్శిస్తే.. అనిల్‌కుమార్ యాదవ్ మైకాసురుడైపోయేవాడు. అనిల్ వరుస కౌంటర్లతో రాజకీయాన్ని హీటు పుట్టించేవారు. కానీ ఇప్పుడు అనిల్ అడ్రెస్ కూడా తెలియడం లేదనే గాసిప్స్ నెల్లూరు పాలిటిక్స్‌లోచక్కర్లు కొడుతున్నాయి.వైసీపీ అధినేత జగన్‌కు వీర విధేయుడుగా పేరు తెచ్చుకున్న అనిల్ కుమార్ యాదవ్.. అనూహ్యంగా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. కార్పొరేటర్‌గా ఉన్న తన బాబాయ్ చనిపోవడంతో ఆ స్థానానికి జరిగిన బైఎలెక్షన్‌లో పోటీ చేసి విజయం సాధించారు అనిల్. ఆ తర్వాత 2009లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2014, 2019లలో వైసీపీ నుంచి నెల్లూరు సిటీ తరపున నెగ్గిన అనిల్ కుమార్ తన ఫైర్ బ్రాండ్ ఇమేజ్ తోనే పార్టీలో పలుకుబడి సాధించారు. ఆయన 2014 నుంచి 2019 మధ్య అసెంబ్లీ లోపలా బయటా వైసీపీ తరఫున గట్టిగానే వాయిస్ వినిపించారు. ఇక 2019లో ఆయనకు జగన్ మార్క్ సామాజిక సమీకరణలతో మంత్రి పదవి దక్కింది. అనిల్ కుమార్ యాదవ్ బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో కొందరు రెడ్డి సామాజికవర్గ ఎమ్మెల్యేలు దూరంగా ఉండేవారు. దీంతో రెడ్ల ఎమ్మెల్యేలు, అనిల్ మధ్య గ్యాప్ పెరిగింది. దీంతో జిల్లాకు చెందిన పలువురు నేతలు ఆయనకు దూరమయ్యారు. మూడేళ్ల తర్వాత అనిల్ కుమార్ స్థానంలో కాకాని గోవర్ధన్ రెడ్డికి మంత్రి పదవి దక్కింది. అప్పటి నుంచి జిల్లాలో పార్టీ నేతలు.. అనిల్‌కు మధ్య అంతరం మరింత తీవ్రమైందిఈ సమయంలో జిల్లాలో తెల్లరాయి తవ్వకాలు.. అమ్మకాలకు సంబంధించి అనిల్‌కు బాధ్యతలు అప్పగించడంపై వైసీపీ నేతలు? పార్టీ అధిష్టానం దగ్గర తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారట. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అనిల్ కుమార్ యాదవ్‌ను నెల్లూరు సిటీ నుంచి తప్పించి నరసరావుపేటకు షిఫ్ట్ చేశారు. దీంతో అనిల్‌ను జిల్లా నుంచి పంపించేశామని?అప్పట్లో కొందరు వైసీపీ నేతలు పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. అప్పుడు అయిష్టంగానే అనిల్ ఎంపీగా పోటీ చేసినట్లు ప్రచారం ఉంది. అందుకే ఓడిపోవడంతో పొలిటికల్ గా సైలెంట్ అయినట్లు నెల్లూరులో గుసగుసలు వినిపిస్తుంటాయి.అనిల్ కుమార్ యాదవ్ నరసరావుపేటకు షిఫ్ట్ అయినా.. నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ సీటును మాత్రం తన అనుచరుడైన ఖలీల్ అహ్మద్ ఇప్పించుకున్నారు. ఈ నిర్ణయంపై అప్పటి వైసీపీ నేత? వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆ తర్వాత అనిల్ ఓడిపోవడం, వైసీపీ ప్రభుత్వం గద్దె దిగిపోవడంతో ఆయన సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. ఆయన ప్లేస్‌లో నెల్లూరు సిటీ ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డిని నియమించింది పార్టీ హైకమాండ్. అనిల్ కుమార్ యాదవ్ టచ్‌లోకి రాకపోవడంతో ఆయన వర్గీయులంతా ఇప్పుడు చంద్రశేఖర్ రెడ్డితోనే ఉంటున్నారు.ప్రస్తుతం అనిల్‌కుమార్ యాదవ్ తన బిజినెస్‌లను చూసుకుంటున్నారట. అప్పుడప్పుడు నెల్లూరు సిటీకి వస్తున్న అనిల్.. అత్యంత సన్నిహితులనే కలుస్తున్నారట. తన రాజకీయ విరామమం టెంపరరీ మాత్రమేనని సన్నిహితులకు చెప్పి వెళ్తున్నారట అనిల్. అప్పుడు చంద్రశేఖర్ రెడ్డి చేపట్టే కార్యక్రమాల్లోనే మెరుస్తున్నారు. మొత్తానికి రాజకీయాలకు దూరంగా ఉంటున్న అనిల్ భవిష్యత్‌లో ఎలాంటి వ్యూహంతో ముందుకెళ్తారనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది

OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036